



ఉద్యమం.. ఉద్ధృతం

● మున్ముందుకు జిందాల్ భూ నిర్వాసితుల పోరాటం
● మద్దతు ఇస్తున్న ప్రజా సంఘాలు
● సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తున్న ప్రభుత్వం
● భూములన్నింటినీ తిరిగి అప్పగించాలని రైతుల డిమాండ్

↑ ఎస్.కోట మండలం కిల్తంపాలెం గ్రామ పరిధిలో సేకరించిన భూముల్లో ఉన్న జిందాల్ తాత్కాలిక కార్యాలయ భవనాలు

● శృంగవరపుకోట మండల పరిధిలోని జిందాల్ సౌత్ వెస్ట్ అల్యూమినియం లిమిటెడ్‌కు కేటాయించిన భూములను తక్షణమే ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. భూమిలేని వారికి, చిన్న రైతులకు పంపిణీ చేయాలి. ఈనెల 5న భూసేకరణ గ్రామాలు ముషిడిపల్లి, కిల్తంపాలెం, చీడిపాలెం, చిన్నఖండేపల్లి, మూల బొడ్డవరకు చెందిన నిర్వాసిత రైతులను కలిశాం. పరిశ్రమ వస్తే ఉపాధి దొరకుతుందని ఆశపడి భూములిచ్చి మోసపోయినట్లు వాపోయారు. సేకరించిన భూమిని జిందాల్ యాజమాన్యం గడిచిన 18 సంవత్సరాలుగా నిరుపయోగంగా తన ఆధీనంలో ఉంచుకుంది. భూమిని కోల్పోయిన రైతులకు జీవనాధారం లేకుండా చేసింది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో 2023 ఫిబ్రవరి 20న అల్యూమినియం పరిశ్రమకు బదులుగా ఎంఎస్ఎంఈ పార్కు, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోనేందుకు అనుమతులు తీసుకుంది. ఇది ప్రైవేటు సంస్థలకు నేరుగా లాభం చేకూర్చే చర్యగా నమ్ముతున్నాం. ఉపాధి కోల్పోయిన రైతులకు భూమిని తిరిగి ఇచ్చేయాలని న్యాయపూర్వకంగా పోరాటం చేస్తుంటే పోలీసులతో బెదిరించడం దురదృష్టకరం.

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథరావు, కార్యవర్గ సభ్యురాలు కె.అనురాధ, ఏపీ, తెలంగాణ సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటన


తాటిపూడి రోడ్డులో బైఠాయించిన జిందాల్ భూ నిర్వాసితులు (ఫైల్)

శృంగవరపుకోట, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిందాల్ భూముల నిర్వాసిత రైతులకు ప్రజా సంఘాలు మద్దతుగా నిలుస్తున్నాయి. సీపీఎం, గిరిజన సంఘాలు పోరాటాన్ని ముందుండి నడిపిస్తున్నాయి. రైతుల సమస్యను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పలు రకాలుగా ప్రభుత్వం దృష్టిలో పెట్టేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఏపీ రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహాదేవ్, ఓ దినపత్రిక అధిపతి రమణమూర్తి నిర్వాసిత రైతుల వద్దకు సోమవారం వచ్చారు. ఉద్యమానికి అండగా ఉంటామని సంఘీభావం తెలిపారు. ఇప్పటికే గిరిజన సంఘ నాయకుడు **(మిగతా 8వ పేజీలో..)**

‘మార్గదర్శులు’ ఎక్కడ? 6లో

● జిల్లాలో అట్టడుగున ఉన్న కుటుంబాలు 67,067 ● ఆదుకునే వారి కోసం ప్రభుత్వం యత్నం ● మంత్రి శ్రీనివాస్ 264 కుటుంబాల దత్తత

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి 7

● కర్లాం కోళ్ల పరిశ్రమ వద్ద కార్మిక కుటుంబాల నిరసన

శివారు భూములకూ సాగునీరు అందిస్తాం

● మద్దువలస నుంచి నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే కోండ్రు 7

కూటమితోనే అభివృద్ధి 7

● సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు 7

ఆ చోరీ కేసు సంగతేంటో?

● 'గురుదేవ ట్రస్టు' ఘటనలో రికవరీ లేదు ● కానరాని పురోగతి
● ప్రధాన నిందితుడి ఆచూకీ దొరకని వైనం

కొత్తవలస, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మంగళపాలెం గ్రామంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఇంట్లో మే 28న జరిగిన భారీ చోరీకి సంబంధించి నమోదైన కేసులో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. దొంగలు దొరికినా పోయిన బంగారం రికవరీ జరగలేదు. ఈ దొంగతనం మహారాష్ట్రకు చెందిన పార్ధి గ్యాంగ్ పనిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించి ఆ దిశగా దర్యాప్తు చేశారు. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులను పట్టుకుని అరెస్టు చేసి కొత్తవలస కోర్టులో హాజరుపర్చారు. ప్రస్తుతం వారు జుడీషియల్ కస్టడీలో రిమాండ్‌లో ఉన్నారు. ఆ ముగ్గురు ఇచ్చిన సమాచారం ప్రకారం మరో ముగ్గురు ప్రధాన నిందితులు ఉన్నారని తెలుస్తోంది. మిగిలిన ముగ్గురిలో లక్కీ అనే నిందితుని వద్దే చోరీ సొత్తు ఉందని పట్టుబడిన నిందితులు పోలీసులకు ఇచ్చిన సమాచారంలో పేర్కొన్నారు. దొంగతనంలో తాము పాల్గొన్నప్పటికీ తమను ఇంటి ముందు కాపలాగా ఉంచారని, అందుకు తమకు రూ.30 వేలు, రూ.20 వేల రూపాయలు చొప్పున ఇచ్చారని తెలిపారు. చోరీసొత్తు అంతా మిగిలిన నిందితులే పట్టుకుపోయారని తెలిపారు.



మహారాష్ట్రకు వెళ్లినా..

ప్రధాన నిందితులను పట్టుకోవడం కోసం సీఐ షణ్ముఖరావు **(మిగతా 8వ పేజీలో..)**

---

9 గంటలకు రావాల్సిందే



● విధి నిర్వహణపై ఎంఈవోలకు ఆదేశం
● జీపీఎస్ హాజరుతో పర్యవేక్షణ
● పాఠశాలల తనిఖీలు తప్పనిసరి
● కమిషనరేట్ నుంచి తాజాగా ఉత్తర్వులు

రాజాంరూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పనిచేసేచోట నివాసం ఉండకుండా.. నచ్చిన సమయానికి ఆఫీస్‌కు వెళ్లే మండల విద్యాశాఖాధికారులకు ప్రభుత్వం చెక్ పెట్టే చర్యలకు దిగింది. కార్యాలయానికి ఖచ్చితంగా ఉదయం తొమ్మిది గంటలకే వెళ్లి ఆన్‌లైన్‌లో ముఖహాజరు వేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిరోజూ తప్పనిసరిగా ఓ పాఠశాలను తనిఖీ చేయాలని చెప్పింది. ఇదే విషయాన్ని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టం చేస్తూ ఎంఈవోలు పాటించేలా పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖాధికారులకు నిర్దేశించారు. పాఠశాలల పర్యవేక్షణ, విద్యా పథకాల అమలు, హెచ్‌ఎంలు...టీచర్ల పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలు చూడడం ఎంఈవోల విధి. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎంఈవో-2ను నియమించింది. అప్పటి నుంచి జిల్లాలోని 27 మండలాల్లో 54 మంది ఎంఈవోలు పనిచేస్తున్నారు.

గాడిన పడని విద్యా శాఖ

జిల్లాలో 54 మంది విద్యాశాఖాధికారులు విధులు నిర్వహిస్తున్నా పాఠశాలల పర్యవేక్షణ గాడిన పడలేదు. మండలానికి ఇద్దరు **(మిగతా 8వ పేజీలో..)**

కమిషనర్ ఆదేశాలు పాటించాలి

విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం ఎంఈవోలు తప్పనిసరిగా సమయపాలన పాటించాలి. నిర్దేశించిన సమయంలోనే ముఖ హాజరు వేయాలి. ప్రతిరోజూ ఓ పాఠశాలను తనిఖీ చేయాల్సిందే. జిల్లాలోని అందరి ఎంఈవోల హాజరు సమాచారాన్ని ప్రతిరోజూ జిల్లా విద్యాశాఖ కమిషనరేట్‌కు పంపుతుంది. ఎంఈవోలు పాఠశాల తనిఖీలకు వెళ్లినపుడు జీపీఎస్ విధానంలో అక్కడి లోకేషన్ నుంచి హాజరు వేయాలి. ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి.

- మాణిక్యంనాయుడు, డీఈవో, విజయనగరం

ప్రతిష్ఠాత్మకంగా పేరెంట్స్ డే

● ఏర్పాట్లలో జిల్లా విద్యాశాఖ తలమునకలు
● పిల్లల సమగ్ర ప్రగతిని వివరించనున్న ఉపాధ్యాయులు

చీపురుపల్లి, జులై 7(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్ని బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు చర్యలు తీసుకుంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సంబంధాలను మరింత బలపరచడానికి శ్రీకారం చుట్టింది. దీంట్లో భాగంగానే ఈ నెల10న మెగా పేరెంట్స్ డే నిర్వహించడానికి నిర్ణయించింది. జిల్లాలోని 2229 పాఠశాలల్లోనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరపడానికి పాఠశాల విద్యా శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం ఆయా పాఠశాలల కాంపోజిట్ గ్రాంట్ల నుంచి 20 శాతం నిధుల్ని వెచ్చించాలని ఆదేశించింది. పది మంది పిల్లలున్న బడులకు వెయ్యి రూపాయలు, 300 నుంచి 400 మంది విద్యార్థులున్న పాఠశాలలకు ఐదు వేలు, ఇలా పిల్లల సంఖ్యను బట్టి నిధులను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష **(మిగతా 8వ పేజీలో..)**

సాయన్నగెడ్డపై కూలిన వంతెన

● రెండు మండలాల వాహన రాకపోకల బంద్
● కొండగూడెం- మాధవరాయపురం మధ్య ఘటన

రేగిడి/సంతకవిటి, జూలై 7(ఆంధ్రజ్యోతి): రేగిడి, సంతకవిటి మండలాలను కలిపే ప్రధాన రహదారిలో సాయన్నగెడ్డపై ఉన్న వంతెన ఉన్నఫలంగా కూలిపోయింది. సంతకవిటి మండలం కొండగూడెం-మాధవరాయపురం గ్రామాల మధ్య ఉన్న ఈ వంతెన ఆదివారం అర్ధరాత్రి కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవటం, వాహనాలు ప్రయణించే అవకాశం లేకపోవడంతో పెద్ద నష్టం తప్పింది. వంతెన దాదాపు 80శాతం కూలిపోయింది. సోమవారం ఉదయం నుంచి అటుగా వెళ్లేందుకు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ద్విచక్ర వాహనాలు మాత్రమే ఓ పక్క నుంచి నెమ్మదిగా వెళ్లాయి. ఈ వంతెన దాదాపు యాభై ఏళ్ల కిందట నిర్మించినది. రేగిడి మండలం ఉప్పరనాయుడువలస, వన్నలి, ఖండ్యాం **(మిగతా 8వ పేజీలో..)**


కొండగూడెం, మాధవరాయ పురం మధ్య కుప్పకూలిన వంతెన

గంజాయి కేసులో ముగ్గురికి జైలు

విజయనగరం క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): రేగిడి పోలీసుస్టేషన్‌లో 2023లో నమోదైన గంజాయి కేసులో ముగ్గురు నిందితులకు నాలుగేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికీ రూ.10 వేలు జరిమానా విధిస్తూ శ్రీకాకుళం ఏడీజె న్యాయాధికారి పి.భాస్కరరావు తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. అప్పట్లో బూరాడ జంక్షన్ వద్ద పోలీసులు ఆగస్టు 7న వాహన తనిఖీలు చేపట్టగా ఏపీ 39 ఎస్‌హెచ్ 0487 నెంబరు గల ద్విచక్ర వాహనంపై గంజాయి తీసుకువెళ్తున్న వి.రాంబాబు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని, అతని వద్ద నుంచి బైక్‌తో పాటు 1.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. రాంబాబు ఇచ్చిన సమాచారంతో మరో ఇద్దరు నిందితులు టి.వెంకటేష్, టి.జీనాబంధూస్‌లను అప్పటి రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4.8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారని చెప్పారు. నేరారోపణలు రుజువు కావడంతో న్యాయాధికారి సోమవారం తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ తెలిపారు.



అప్రమత్తతే అలర్జీకి మందు

● ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ప్రత్యేక చికిత్స
● నేడు వరల్డ్ అలర్జీ డే

అలర్జీ సమస్య ఎక్కువ మందికి అనుభవమే. తుమ్ములు, దగ్గు, ఒంటినిండా దద్దుర్లు వచ్చి ఇబ్బంది పడుతున్న వారు కోకొల్లలు. అవి నిరంతరం చికాకు కలిగిస్తుంటాయి. అలర్జీ పట్ల సరైన అవగాహన లేకపోవడం.. తేలిగ్గా తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక సమస్యగా మారుతుంటుంది. అలర్జీపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ఏటా జూలై 8న అలర్జీ నివారణ దినాన్ని నిర్వహిస్తున్నారు. ప్రత్యేక కథనం 6లో..

గిరిజన ప్రాంతాల్లో ఆదికర్మ యోగి

● సరికొత్త కార్యక్రమానికి కేంద్రం శ్రీకారం
● తొలి విడతలో మన్యం జిల్లాకు చోటు ● ఏజెన్సీ అభివృద్ధికి తోడ్పాటు

పార్వతీపురం, జూలై7(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో సమర్థవంతమైన పాలన అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆది కర్మయోగి కార్యక్రమాన్ని అమలులోకి తెచ్చింది. ఈ మేరకు రాష్ట్రంలో 18 జిల్లాలను ఎంపిక చేశారు. తొలివిడతగా నాలుగు జిల్లాల్లో దీనిని అమలు చేయనుండగా.. ఈ జాబితాలో పార్వతీపురం మన్యం జిల్లా ఉండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా ధార్తి ఆభా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీఏజేజీయూఏ)కు ఆది కర్మయోగి కార్యక్రమాన్ని అనుసంధానం చేస్తూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం తదితర అంశాలపై గిరిజనులకు అవగాహన కల్పించనున్నారు. దీనికోసం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖలకు చెందిన ఏడుగురు మాస్టర్ ట్రైనీలను ఎంపిక చేశారు. బెంగళూరులో జరిగే శిక్షణ కార్యక్రమానికి వారంతా వెళ్లనున్నారు. జిల్లా నుంచి గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న వీవీఎస్ నాయడు , పార్వతీపురం ఐటీడీఏఏ ఏపీవో మురళీధర్ మాస్టర్ ట్రైనీలుగా ఎంపికయ్యారు. వారు ఈనెల 10న బెంగళూరులో జరిగే శిక్షణ కార్యక్రమానికి వెళ్లనున్నారు. ఆదికర్మ యోగి కార్యక్రమానికి మొదటి విడతలో జిల్లా ఎంపిక కావడం, తాను మాస్టార్ ట్రైనీగా శిక్షణకు హాజరుకానుండడం ఆనందంగా ఉందని ఏపీవో మురళీధర్ తెలిపారు. ఈ నెల 16 వరకు శిక్షణ ఉంటుందని వెల్లడించారు.





అప్రమత్తతే అలర్జీకి మందు

- ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ప్రత్యేక చికిత్స
- నేడు వరల్డ్ అలర్జీ డే



అలర్జీ అంటే

వెలుపల నుంచి వచ్చే కొన్ని పదార్థాలను శరీరం తట్టుకోలేని స్థితిని అలర్జీ అంటారు. వీటిని అలర్జీ కారకాలు లేదా అలర్జెన్స్ అంటారు. మన శరీరంలోకి అవి ప్రవేశించినప్పుడు మన రోగ నిరోధక వ్యవస్థ వాటిని శత్రువులు అనుకుని అతిగా స్పందిస్తుంది. ఈ అతి స్పందనే అలర్జీ లక్షణాలకు దారితీస్తుంది. ఉదాహరణకు కొందరికి పుప్పొడి రేణువుల వల్ల తుమ్ములు వస్తే.... మరికొందరికి వేరుశెనగ తింటే దద్దుర్లు వస్తాయి. ఇక్కడ పుప్పొడి, వేరుశెనగ అలర్జీ కారకాలు అన్న మాట.

విజయనగరం రింగురోడ్డు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అలర్జీ అనేది చాలా మందికి ఏదో ఒక రూపంలో అనుభవమే. తుమ్ములు, దగ్గు, ఒంటినిండా దద్దుర్లు వచ్చి జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. చికాకు కలిగిస్తుంటాయి. అలర్జీ పట్ల సరైన అవగాహన లేకపోవడం.. దీనిని తేలిగ్గా తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక సమస్యగా మారే అవకాశం ఉంది. అలర్జీపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ఏటా జూలై 8న అలర్జీ నివారణ దినాన్ని నిర్వహిస్తున్నారు. అలర్జీ గురించి తెలుసుకుని జాగ్రత్త పడడమే దీని ముఖ్య ఉద్దేశం.

ఎందుకు వస్తాయంటే..

వాతావరణ కాలుష్యం: వాహనాల నుంచి వచ్చే పొగ, పరిశ్రమల నుంచి వచ్చే వాయువులు, దుమ్మూ ధూళి వంటివి శ్వాసకోశ అలర్జీలకు ప్రధాన కారణం.

పుప్పొడి: కొన్ని మొక్కల పువ్వుల నుంచి వచ్చే పుప్పొడి రేణువులు గాలిలో కలిసి అలర్జీని కలిగిస్తాయి. వసంత రుతువులో ఇవి ఎక్కువగా అలజడిని కలిగిస్తాయి.

పెంపుడు జంతువులు: కుక్కలు, పిల్లుల బొచ్చు కూడా కొందరిలో అలర్జీలకు కారణమవుతుంది.

ఆహార పదార్థాలు: పాలు, గుడ్లు, వేరుశెనగ, గోధుమలు, చేపలు, కొంతమందికి అలర్జీని కలిగించే ఆహారాలు.

రసాయనాలు: కొన్ని రకాల కాస్మెటిక్స్, డిటర్జెంట్లు, మెటల్స్ (నగల్లో నికెల్ వంటివి) చర్మ అలర్జీకి దారితీస్తాయి.

బూజు: (మోల్డ్) తేమ ఉన్న ప్రదేశాల్లో పెరిగే బూజులోని శిలీంధ్రాలు కూడా అలర్జీకి కారణమవుతాయి.

దుస్తులు: ఉన్ని లేదా సింథటిక్ దుస్తులు కొందరికి చికాకు కలిగిస్తాయి.

తేలికగా తీసుకోకూడదు..



తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అలర్జీని నివారించవచ్చును. ముఖ్యంగా దుమ్ము, ధూళి ఉన్న ప్రాంతాల్లో మాస్క్‌ను ధరించడం ద్వారా అలర్జీ సమస్యలను నివారించవచ్చును. అలర్జీ లక్షణాలు ఉన్నవారు తేలికగా తీసుకోకుండా, వైద్యుడిని సంప్రదించాలి. వారు సరైన చికిత్స ద్వారా దీనిని తగ్గిస్తారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో అలర్జీ సమస్యలకు ప్రత్యేక పరీక్షలు, ఇమ్యునోథెరపీ చికిత్సలు అందిస్తున్నాం. దీని ద్వారా అలర్జీ చాలా వరకూ తగ్గుముఖం పడుతుంది. సరైన జాగ్రత్తలు, అవగాహన, చికిత్సతో అలర్జీ సమస్యలు కలవారు ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చును.

- డాక్టర్ దక్షిణామూర్తి, ఈఎన్‌టీ స్పెషలిస్ట్, ప్రభుత్వ సర్వజనాసుపత్రి, విజయనగరం

కొన్ని సార్లు దుస్తులకు వాడే రంగులు లేదా వాటిని ఉతకడానికి వాడే డిటర్జెంట్లు కూడా అలర్జీకి కారణమవుతాయి.

- కొన్ని రకాల యాంటీబయోటిక్స్ వంటి మందులు లేదా క్రీములు వాడినప్పుడు కొందరికి చర్మ అలర్జీలు వస్తాయి.
- కొంత మందిలో అలర్జీలను కలిగించే ఆహారం తిన్నప్పుడు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, ఒంటిపై దద్దుర్లు, ఒక్కొక్కసారి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కూడా వస్తాయి.

లక్షణాలు ఇవే

అలర్జీల వల్ల ఎక్కువ మందిలో జలుబు, తుమ్ములు, ముక్కుకారడం, ముక్కు దిబ్బడ, గొంతునొప్పి, దగ్గు, చర్మంపై దద్దుర్లు, దురద వంటి లక్షణాలు కనిపిస్తాయి.



పరిశుభ్రత అవసరం



చర్మ అలర్జీ సమస్యలు కలవారు శారీరక పరిశుభ్రత పాటించాలి. సాధారణంగా దురద, ఎర్రబడడం, దద్దుర్లు, పొక్కులు, పగుళ్ల వంటి లక్షణాలు చర్మ అలర్జీలో కలుగుతాయి. ఈ లక్షణాలు కనిపిస్తే.. అలర్జీ కారకాలకు దూరంగా ఉండాలి. అలర్జీ సమస్య తీవ్రమైతే, అశ్రద్ధ చేయకుండా చర్మ వ్యాధి నిపుణులను సంప్రదించడం ఉత్తమం.

- డాక్టర్ చండీప్రియ, డెర్మటాలజిస్టు, విజయనగరం

జాగ్రత్తలు తప్పనిసరి

- అలర్జీ దేని వల్ల వస్తుందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం దీని నివారణలో తొలి అడుగు.
- ఇంట్లో కర్టెన్లు, కార్పెట్లు తగ్గించి.. బెట్‌షీట్స్, పిల్లో కవర్లు వేడి నీటితో ఉతకాలి.
- పుప్పొడి ఎక్కువగా ఉండే సమయంలో బయటకు వెళ్లడం తగ్గించాలి.
- బయటి నుంచి వచ్చాక దుస్తులు మార్చుకుని స్నానం చేయాలి.
- అలర్జీని కలిగించే ఆహార పదార్థాల జాబితాను తెలుసుకుని వాటిని పూర్తిగా మానేయాలి.
- పెంపుడు జంతువులు ఉంటే... వాటిని బెడ్‌రూంలోకి రానివ్వకుండా ఉంచడం... వాటికి ఎప్పటికప్పుడు శుభ్రంగా స్నానం చేయించడం ద్వారా అలర్జీ రాకుండా జాగ్రత్త పడవచ్చు.
- చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అలర్జీలను నివారించడానికి సాయపడుతుంది.
- దుమ్ము, పుప్పొడి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో లేదా వాతావరణంలో కాలుష్యం ఉన్నప్పుడు మాస్క్ ధరించడం వల్ల శ్వాసకోశ అలర్జీలు లేకుండా చేసుకోవచ్చును.

అలర్జీకి ప్రత్యేక చికిత్స

విజయనగరంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో అలర్జీ సమస్యలకు స్కిన్ ప్రిక్ టెస్ట్ (ఎస్‌పీటీ) పరీక్షలను నిర్వహిస్తారు. అలాగే ఇమ్యూనోథెరపీ చికిత్సలు అలర్జీని నివారించడానికి సాయపడతాయి.



సాలూరులో పీర్ల పండుగలో పాల్గొన్న ముస్లింలు

ఘనంగా పీర్ల పండుగ

సాలూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పీర్ల పండుగను ముస్లింలు సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ముస్లిం వీధిలో బయలుదేరి కోట దగ్గరి గుడి మీదుగా ర్యాలీగా డబ్బి వీధికి చేరుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ఏరియా ఆసుపత్రి మీదుగా వేగావతి నది వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మంది ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాగావళికి స్వల్ప వరద

గరుగుబిల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి సోమవారం స్వల్ప వరద పోటెత్తింది. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఎగువ ప్రాంతాల నుంచి సుమారు 5 వేల క్యూసెక్కులకు పైగా ప్రవాహం నదిలోకి చేరుతోంది. అధికారులు ముందస్తుగా స్పిల్‌వే గేట్ల నుంచి దిగువ ప్రాంతాలకు 4,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం వర్షాల కారణంగా రైతులకు సాగునీరు అవసరం లేకపోవడంతో పాత బ్యారేజీ పరిధిలోని రెండు కాలువల నుంచి సాగునీరు విడుదల చేయలేదు. ఉల్లిభద్ర పరిధిలోని కుడి ప్రధాన కాలువ నుంచి చెరువులను నింపుకొనేందుకు ముందస్తుగా 100 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 103.90 మీటర్ల నీటి నిల్వ ఉంది. వరద కారణంగా కొంతమేర దిగువకు విడుదల చేస్తున్నారు. 2.534 టీఎంసీలకు గాను 1.848 టీఎంసీల నిల్వ ఉంది. వరద ప్రవాహం అధికంగా వచ్చినా... నదీ తీరవాసులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రాజెక్టు ఈఈ హెచ్.మన్మథరావు తెలిపారు.



స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు వరద ప్రవాహం

ప్రధాన దేవాలయానికి జగన్నాథుడు

- ముగిసిన రథోత్సవాలు



రథంపై ఉన్న జగన్నాథ స్వామి

పాలకొండ, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన జగన్నాథస్వామి రథోత్సవాలు సోమవారంతో ముగిశాయి. స్వామి వారు రథంపై ప్రధాన దేవాలయానికి చేరుకున్నారు. రథంపై ఆలయ ప్రధాన అర్చకులు మఠం విశ్వనాథ దాసు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో సర్వేశ్వర రావు యాత్రకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. యాత్ర జరిగిన ప్రదేశంలో ఎగ్జిబిషన్‌లో చిన్నారులు, పెద్దలు రంగులరాట్నం తదితరమైనవి ఎక్కి ఉత్సాహంగా గడిపారు. చిన్నారుల కోసం ప్రత్యేకమైన బొమ్మలు, గాలిపటాలు, బెలూన్లతో షాపుల వద్ద కోలాహలం కనిపించింది. పట్టణంతో పాటు సమీప గ్రామాల ప్రజలు, ఒడిశా రాష్ట్రంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించండి

- ఎస్పీ వకుల్ జిందాల్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 40 అర్జీలు

విజయనగరం క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలోని బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 40 అర్జీలను స్వీకరించారు. వీటిలో భూ తగాదాలకు సంబంధించి 13, కుటుంబ కలహాలకు సంబంధించి 4, మోసాలకు పాల్పడినట్టు 5, ఇతర అంశాలకు సంబంధించి 18 ఫిర్యాదులు ఉన్నాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలపై విచారణ చేపట్టి.. చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తీసుకున్న ఫిర్యాదులను ఏడు రోజుల్లో పరిష్కరించి.. తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, బి.సుధాకర్, ఎస్‌ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్



జీడితోటలో ఉన్న ఏనుగులు

గోరపాడులోనే గజరాజులు

సీతంపేట రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరపాడు, మోహన కాలనీ గ్రామాల మధ్య ఏనుగులు సంచరిస్తున్నాయి. సోమవారం వేకువజాము ప్రాంతంలో గోరపాడు సమీపంలోని కొండదిగువ ఏనుగుల ఘీంకారాలు వినిపించాయని స్థానిక గిరిజనులు తెలిపారు. ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించాలని అధికారులను వారు కోరుతున్నారు.

కుప్పకూలిన వైటీసీ భవనం

- ఖాళీగా ఉండడంతో తప్పిన ప్రమాదం

సాలూరు రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం జీగిరాంలో ఉన్న వైటీసీ (యూత్ ట్రైనింగ్ సెంటర్) భవనం సోమవారం ఒక్కసారిగా కూలిపోయింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ భవనం బాగా నానిపోయి ఉంది. దీంతో సోమవారం కురిసిన వర్షాలకు కూలిపోయింది. ఈ భవనం ప్రస్తుతం ఖాళీగా ఉంది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. సాలూరు నియోజకవర్గ గిరిజనులకు వృత్తి విద్యలో శిక్షణకు ఈ భవనాన్ని వినియోగించేవారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ భవనం రెండున్నర దశాబ్దాల కిందట నిర్మించారు. ఐటీడీఏ, వెలుగు ఆధ్వర్యంలో టైలరింగ్, రాడ్ బెండింగ్, వెల్డింగ్ తదితర వృత్తి విద్యలకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేవారు. కొన్ని సంవత్సరాలుగా ఇది నిరుపయోగంగా ఉంది. ఈ భవనంలో ఎటువంటి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం లేదు. గుమడాంలో వైటీసీ నిర్మాణంతో అక్కడే శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీని వల్ల భవనం కూలిపోయినా..ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. దీంతో పరిసరాల్లోని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



జీగిరాంలో కూలిన వైటీసీ భవనం శిథిలాలు

'మార్గదర్శులు' ఎక్కడ?

- జిల్లాలో అట్టడుగున ఉన్న కుటుంబాలు 67,067
- ఆదుకునే వారి కోసం ప్రభుత్వం యత్నం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ 264 కుటుంబాల దత్తత
- సంపన్న వర్గాలు ముందుకు రావాలని పిలుపు

విజయనగరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పీ4లో భాగంగా కూటమి ప్రభుత్వం 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టనర్ విధానమే పీ4. సమాజంలో ఉన్నతంగా ఉండే 10 శాతం సంపన్న వర్గాల వారు అట్టడుగున ఉన్న 20 శాతం నిరుపేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలన్నది ఈ పథకం లక్ష్యం. సాయానికి ముందుకు వచ్చే సంపన్న వర్గాలను మార్గదర్శిగా.. సాయం పొందే పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా నామకరణం చేశారు. ఈ ఏడాది ఉగాది నాడు సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి చేపట్టిన సర్వే ప్రస్తుతం పూర్తయింది. జిల్లాలో 67,067 కుటుంబాలు అట్టడుగున ఉన్నట్టు లెక్క తేల్చారు. వీరిని సంపన్న కుటుంబాలు దత్తత తీసుకొని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించారు.

జిల్లాకు ప్రయోజనం..

రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల్లో విజయనగరం ఒకటి. ఇక్కడి ప్రజల జీవనాధారం వ్యవసాయం. సాగు గిట్టుబాటు కాక చాలామంది సుదూర ప్రాంతాలకు వలస పోతుంటారు. జిల్లాలో సాగునీటి వనరులు ఉన్నా... వాటిని సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతూ వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నా ఎటువంటి సాంత్వన లేకుండా పోతోంది. ఉపాధి కోసం ఎక్కువ మంది సుదూర ప్రాంతాలకు వలసపోతున్నారు. అటువంటి నిరుపేద కుటుంబాలను గుర్తించి జీవన ప్రమాణాలు పెంచాలన్నదే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ప్రభుత్వ గణాంకాల ప్రకారం జిల్లాలో దారిద్ర్య రేఖకు దిగువన 5.71 లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఇందులో అత్యంత నిరుపేదలకు ఈ పథకం కింద సాయం అందనుంది.

అందరూ భాగస్వాములు కావాలి

మార్గదర్శి-బంగారు కుటుంబాల పథకం మహోన్నతమైనది. జన్మభూమి కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని సీఎం చంద్రబాబు దీనికి రూపకల్పన చేశారు. సమాజంలో అసమానతలు తొలగిస్తూ... కిందనున్న వారికి చేయి అందించి పైకి తెచ్చే కార్యక్రమం ఇది. అందరూ భాగస్వాములు కావాలి. జిల్లాలో పేదరికం అనేది లేకుండా చేయాలి. ఈ విషయంలో సంపన్న వర్గాలు, అధిక ఆదాయ వర్గాలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

- కొండపల్లి శ్రీనివాస్, మంత్రి

ఉదారత చూపితేనే...

జిల్లాలో సంపన్న కుటుంబాలు ఉదారత చాటితేనే ఈ కార్యక్రమం విజయవంతమయ్యే అవకాశం ఉంది. ముందుగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ 264 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు. డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ 20 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఇప్పటివరకూ 9 మంది మాత్రమే మార్గదర్శకులుగా నమోదు చేసుకోవడం గమనార్హం. జిల్లాలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు పెరగాల్సిన అవసరం ఉంది. పేదలకు సాయం చేయడం ద్వారా తప్పకుండా మార్గదర్శకులవుతారు. చాలా మంది సంపన్న కుటుంబాలు, అధిక ఆదాయ వర్గాల వారు దత్తత తీసుకొని మార్గదర్శకులుగా నిలవచ్చు. వీరికి కొన్ని రకాల పన్నుల విషయంలో ప్రభుత్వం మినహాయింపు ఇచ్చే అవకాశం ఉంది.

నియోజకవర్గాల వారీగా..

జిల్లా వ్యాప్తంగా బంగారు కుటుంబాలకు సంబంధించి సర్వే కొలిక్కి వచ్చింది. నెల్లిమర్లలో అత్యధికంగా 10,479 పేద కుటుంబాలు ఉన్నట్టు తేలింది. రాజాం నియోజకవర్గంలో 9,320, బొబ్బిలిలో 10,146, చీపురుపల్లిలో 10,220, గజపతినగరంలో 8,248, ఎస్.కోటలో 7,912, విజయనగరంలో 8,764, సాలూరు నియోజకవర్గం పరిధిలోని మెంటాడ మండలంలో 2,067 నిరుపేద కుటుంబాలు ఉన్నట్టు తేలింది. వారి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



పౌర సేవలు సరళతరం చేసేందుకు చర్యలు

విజయనగరం రింగురోడ్డు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పౌర సేవలను మరింత సరళతరం చేయడమే పురమిత్ర, మనమిత్ర యాప్ ఉద్దేశ్యమని కమిషనర్ డైరక్టర్ ఆఫ్ మున్సిపల్ ఎడ్మినిస్ట్రేషన్ సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు అంశాలను నగరపాలక సంస్థ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా పౌర సేవలు పొందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్దేశ్యమన్నారు. అందులో భాగంగానే వాట్సాప్ గవర్నర్స్ తీసుకు వచ్చారని తెలిపారు. పురపాలక, నగపాలక సంస్థలో అందిస్తున్న సేవలను పరిశీలించి ఉత్తమ ఫలితాలు కనబరిచిన సంస్థలకు అవార్డులు అందజేస్తామని చెప్పారు. కమిషనర్ నల్లనయ్య, సహాయక కమిషనర్ అప్పలరాజు, ఎంహెచ్‌వో డా.సాంబమూర్తి, ఏసీపీలు హరిబాబు, రమణమూర్తి, ఈఈ ప్రసాద్, సిటీ మిషన్ మేనేజరు సన్యాసిరావు పాల్గొన్నారు.

వసతిగృహాల పరిరక్షణకు రౌండ్ టేబుల్ సమావేశం

వేపాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట నియోజకవర్గంలోని ప్రభుత్వ వసతి గృహాల పరిరక్షణకు ఈనెల 11న విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎస్.కోటలో గల ఆర్కే ఫంక్షన్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు జిల్లా దళిత ఉద్యమ నేత ఆతవ ఉదయభాస్కర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం వేపాడలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు బోనెల ఈశ్వరరావు, కప్పరెడ్డి వెంకటరావు, మొయ్యి వెంకటరమణ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

గజపతినగరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎండీఎం నిర్వాహకులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 9న జరుగనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈవో ఎస్.విమలమ్మకు సమ్మె నోటీసు అందజేశారు. సంఘం నాయకురాలు సత్యవతి, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకుడు పైడిరాజు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చీపురుపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కనక మహాలక్ష్మి ఆలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప ఆలయానికి పట్టణానికి చెందిన జి.రామ్మోహనరావు దంపతులు రూ.50,116 విరాళంగా ఇచ్చారు. సోమవారం వారు ఈ మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఎస్వీజీ శ్రీనివాసరావు, అప్పికొండ ఆదిబాబు, దాసరి రవిలకు అందజేశారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

డెంకాడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్‌లలో ఎరువులను ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో సంగీత హెచ్చరించారు. మండలంలోని ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్‌లను ఆమె సోమవారం తనిఖీ చేశారు. ఎరువుల దుకాణంలో ఉన్న స్టాకును, రికార్డులను పరిశీలించారు. ఏఈవో రామకోటి పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి వస్తువుల బహూకరణ

చీపురుపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి విశాఖపట్టణానికి చెందిన ఎస్.తిరుమలరావు, నాగకన్య దంపతులు వెండి వస్తువులు బహూకరించారు. సుమారు రూ.లక్ష విలువ చేసే 800 గ్రాముల బరువున్న వెండి బిందె, ప్లేట్లు, గిన్నెలను వారు సోమవారం ఈవో బి.శ్రీనివాస్, కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, పొట్నూరు త్రినాథరావులకు అందజేశారు. మాజీ వైస్ చైర్మన్ నూరు వెంకట కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖండ్యాంకు ఎట్టకేలకు ఆర్టీసీ సర్వీస్

రేగిడి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఖండ్యాం గ్రామానికి ఎట్టకేలకు ఆర్టీసీ సర్వీస్‌ను పునరుద్ధరించారు. సోమవారం నుంచి రోజుకు మూడు ట్రిప్పులు అందుబాటులోకి తెస్తున్నట్టు పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామస్థుల సమక్షంలో పాలకొండ ఆర్టీసీ డిపో సీఐ పి.రమేష్ ఆధ్వర్యంలో రూట్ సర్వే నిర్వహించి బస్సును పునరుద్ధరించారు.

వైభవంగా పీర్ల ఊరేగింపు

విజయనగరం రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మొహ్రం పండగను జిల్లా కేంద్రంలో ముస్లింలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నగరంలోని అంబటిసత్రం జంక్షన్, ఆబాద్‌వీధి, కంటోన్మెంట్ తదితర ప్రాంతాల్లో వైభవంగా పీర్లు ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు.



పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- కర్లాం కోళ్ల పరిశ్రమ వద్ద కార్మిక కుటుంబాల నిరసన

చీపురుపల్లి, జులై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లాం వెంకటరామ కోళ్ల పరిశ్రమ వద్ద సోమవారం ఉద్రిక్త వాతావరణ నెలకొంది. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కార్మిక కుటుంబాలు, పరిసర గ్రామాల ప్రజలు నిరసనకు దిగారు. వీరికి మద్దతుగా పలువురు టీడీపీ నాయకులు పరిశ్రమ గేటు ఎదుట బైఠాయించారు. ఈసందర్భంగా నాయకులు, కార్మిక కుటుంబీకులు గేటును తోసుకుని లోపలికి ప్రవేశించడానికి ప్రయత్నించడంతో, అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈసందర్భంగా ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, అలజంగి ఎంపీటీసీ శనపతి శ్రీనివాసరావు, వర్మరాజు, గొర్లె లక్ష్మణరావు తదితరులు మాట్లాడుతూ గతంలో స్థానిక గ్రామాలకు చెందిన కొంతమందికి ఉద్యోగాలు ఇచ్చారని, ఇప్పుడు ఎటువంటి కారణం లేకుండానే వారిని విధుల నుంచి తొలగించారన్నారు. రెండు నెలలుగా సమస్యపై పోరాటం చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని, అంతేకాక పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కార్మికులను తెప్పించి పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యంతో తాము నేరుగా మాట్లాడబో మని, ఎమ్మెల్యే కళావెంకటరావు సమక్షంలో చర్చలకు అంగీకరిస్తేనే ఆందోళన విరమిస్తామని తేల్చి చెప్పారు.



కార్మికులకు మద్దతుగా గేటు బయట బైఠాయించిన నాయకులు, ప్రజలు

దీంతో యాజమాన్య ప్రతినిధి.. ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావుతో మాట్లాడి, ఈనెల 11న చర్చలకు తేదీని ఖరారు చేయడంతో, నాయకులు, ప్రజలు ఆందోళనను విరమించారు. సీఐ జి.శంకరరావు, చీపురుపల్లి, గరివిడి ఎస్ఐలు ఎల్.దామోదరరావు, బి.లోకేష్ బందోబస్తు నిర్వహించారు.

కూటమితోనే అభివృద్ధి

- మంత్రి శ్రీనివాస్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన నీలావతి గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి, ఏడాదిగా ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కొండపల్లి భాస్కర్‌నాయుడు, అల్లు విజయకుమార్, రంధి చినరామునాయుడు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే లలితకుమారి



ముసిరాంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం ముసిరాం గ్రామంలో సుపరిపాలన, తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఆమె ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కొత్తవలస మండలాన్ని పారిశ్రామిక హబ్‌గా మారుస్తామన్నారు. బొబ్బిలి అప్పారావు, కోళ్ల వెంకటరమణ, గొరపల్లి రాము, పీవీ రత్నాజీ, రమేష్, చినరాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి

- మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బంగార్రాజు

భోగాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనితీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. చేపలకంచేరు, రెడ్డికంచేరు గ్రామాల్లో సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రజలకు సంక్షేమ పథకాలపై వివరించారు. విజయనగరం పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలున్నా..

నెల్లిమర్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమస్యలతో ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసి తీరు తామని టీడీపీ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజక వర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. మండలంలోని కొండగుంపాం, పూతికపేట గ్రామాల్లో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని, సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు. జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి గురాన చక్రధర్, కాళ్ల రాజశేఖర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న రవిశేఖర్

జిల్లాకు మంచి గుర్తింపు తీసుకువచ్చారు

- మంత్రి కొండపల్లి

రాజాం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డుకు ఎంపికై జిల్లా ప్రతిష్ఠను ఇనుమడింపజేశారని సెర్ప్, ఎన్ఆర్ఐ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం విజయనగరం క్యాంపు కార్యాలయంలో రాజాం మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రౌతు వెంకటమ్మ, జిల్లా ప్రాజెక్టు మేనేజరు ఎ.చిరంజీవి, ఏపీఎం డి.భవానిలకు ఆయన అభినందించారు. ఈసందర్భంగా వారిని సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు రెండు అవార్డులు రావడం.. అందులో మన జిల్లాకు ఈ రెండు అవార్డులు దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు. మొబైల్ బుక్ కీపింగ్, సంఘ సభ్యుల ఆర్థిక లావాదేవీలు నమోదు చేసే విధానం తదితర విషయాలపై అడిగి తెలుసుకున్నారు. మండల సమాఖ్య ఏబీ సభ్యులు, సీసీలు పాల్గొన్నారు.

శివారు భూములకూ సాగునీరు అందిస్తాం

- ఎమ్మెల్యే కోండ్రు

వంగర, జూలై 7(ఆంధ్రజ్యోతి): మడ్డువలస రిజర్వాయర్ నుంచి ఆయకట్టు శివారు భూములకు నీరు అందించటమే ధ్యేయమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మడ్డువలస కుడి ప్రధాన కాలువ ద్వారా సోమవారం ఆయన నీరు విడుదల చేశారు. ముందుగా ప్రధాన కాలువ మోటార్లు, గంగమ్మకు పూజలు నిర్వహించిన అనంతరం కాలువ ద్వారా నీరు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మడ్డువలస రిజర్వాయర్ ద్వారా ఖరీఫ్‌లో వంగర నుంచి లావేరు వరకు 40 ఎకరాల ఆయకట్టుకు నీరు సరఫరా చేసేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌డీపీఎఫ్ గ్రాంటు కింద రూ.2కోట్లతో కుడి ప్రధాన కాలువలో పూడికలు తీయటానికి చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసేందుకు జల వనరులు శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారని చెప్పారు.



మడ్డువలస నీరు విడుదలకు స్విచ్ ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

ఏడాది పాలనపై ప్రజతో మమేకం

మడ్డువలస నీరు విడుదల అనంతరం మడ్డువలస, మగ్గూరు, జగన్నాథవలసలలో ఎమ్మెల్యే పర్యటించి, ప్రజలతో మమేకమయ్యారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మోహన్‌రావు, వాసుదేవరావునాయుడు, కృష్ణమూర్తి, త్రినాథ దుర్గబాబు, పైల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు ప్రజల కోసం పాలించాలి

- ఏపీ రైతు సంఘాల సమన్వయ కన్వీనర్ శోభనాద్రీశ్వరరావు

శృంగవరపుకోట రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ప్రజలను పాలించడానికి గానీ.. కార్పొరేటర్ల అడుగులకు మడుగులు ఒత్తడానికి కాదని ఏపీ రైతు సంఘాల సమన్వయ కన్వీనర్, మాజీ వ్యవసాయశాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. బొడ్డవర ప్రాంతంలో జిందాల్ నిర్వాసితులు తమ హక్కుల కోసం చేస్తున్న ఆందోళనపై ఆయన తెలుసుకుని వారికి ధైర్యం చెప్పేందుకు కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు వైవీఎస్ మహాదేవన్ ఆధ్వర్యంలో ఇక్కడకు వచ్చారు. ఈసంద ర్భంగా సోమవారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు నివాసంలో ఉన్న జిందాల్ నిర్వాసితులను పలకరించారు. 'రాష్ట్రంలో ఉన్న అన్ని రైతు సంఘాల మీకు అండగా ఉంటాయని.. ఎవరు వచ్చినా మాకు ఒక ఫోన్ చేయాలి' అని సూచించారు. కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహాదేవ్ మట్లాడుతూ 'మీకు అంబేడ్కర్ ఇచ్చిన హక్కులు ఉన్నాయని.. మీ వెనుక లక్షలమంది రైతులు ఉన్నారని' భరోసా ఇచ్చారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

విజయనగరం రింగురోడ్డు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య హెచ్చరించారు. ఆయన ఆదేశాలతో నగరంలోని డబుల్ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న ప్రహరీని ప్రణాళికా సిబ్బంది సోమవారం కూల్చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీ బోర్డులను సీజ్ చేశామని చెప్పారు. నగరంలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని, తక్షణమే కూల్చేస్తామన్నారు.

బంగారు కుటుంబాల దత్తత పూర్తి కావాలి

- కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పీ4 కార్యక్రమంలో భాగంగా వెంటనే మార్గదర్శులను గుర్తించే ప్రక్రియను మొదలుపెట్టాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హెడ్ మాస్టార్లతో సోమవారం ఆయన తన చాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 67,066 బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. అత్యధికంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 6776, తక్కువగా ఎల్.కోటలో 1221 కుటుంబాలు ఉన్నాయని చెప్పారు. ఈ కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులను గుర్తించాలన్నారు. ఈనెల 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, జూనియర్ కాలేజీల్లో మెగా పేరెంట్ సమావేశాలు నిర్వహించాలన్నారు. అందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ సేతు మాధవన్, సీపీవో బాలాజీ, డీఈవో మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు ఉన్నారు.

పీజీఆర్ఎస్‌కు 194 వినతులు

విజయనగరం కలెక్టరేట్, జూలై 7(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 194 వినతులు వచ్చాయి. వీటిని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్, జేసీ సేతుమాదవన్, డీఆర్వో శ్రీనివాస మూర్తి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి 97 వినతులు, పంచాయతీరాజ్ 7, పింఛన్ల మంజూరు చేయాలని 31 వినతులు, మున్సిపాల్టీకి 5, విద్యాశాఖకు 13 తదితర శాఖ వినతులు వచ్చాయి.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

కష్టాల్లో ఉన్నాం.. కరుణ చూపండి

విజయనగరం కలెక్టరేట్, జూలై 7(ఆంధ్రజ్యోతి): తన భర్త రొయ్యి శ్రీహరి హైదరా బాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేవారని, ఏడాదిన్నర కిందట అతనికి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మాట్లాడలేని స్థితిలో ఉన్నారని, నడవలేకపోతున్నారని, దీంతో తమ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతోందని.. ఆదుకోవాలని బొబ్బిలి మండలం గొల్లపల్లికి చెందిన రొయ్యి సుమలత కలెక్టర్‌ను వేడుకుంది. ఆమె తన భర్తతో పాటు కుమారుడిని పట్టుకుని సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహిం చిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చింది. తమ సమస్యను కలెక్టర్‌కు విన్నవించుకుంది. ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేయాలని కోరింది. తన భర్తకు పింఛన్ అయినా మంజూరు చేయించాలని వేడుకుంది. అలాగే తనకు ఉపాధి కల్పించాలని మొరపెట్టుకుంది.



భర్త, కుమారుడుతో కలెక్టరేట్‌కు వచ్చిన సుమలత

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



నిరసన చేపడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాజాం, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం డీటీ ప్రకాష్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరు త్రైమాసిక ఫీజు బకాయిలు రూ.4,200 కోట్లు, హాస్టల్ మెంటెనెన్స్ చార్జీలు రూ.2,200 కోట్లు ఉన్నాయన్నారు. జీవో నెం.77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఎటువంటి చర్యలు లేవన్నారు. జీవో నెం.77ను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 11వ తేదీన కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న మహాధర్నాకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.ప్రవీణ్, పట్టణ నాయకులు జయరాం, రాము, రామకృష్ణ, ప్రవీణ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అసభ్యకరంగా వీడియో తీసిన వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వివాహిత స్నానం చేస్తుండగా వీడియో చిత్రీకరించేందుకు ప్రయత్నించి, ఆమె భర్తపై దాడికి పాల్పడిన కేసులో నగరానికి చెందిన పోలాకి గౌరీశంకర్ అలియాస్ శంకర్‌ను అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 4న ఓ వివాహిత స్నానం చేస్తున్న సమయంలో గౌరీశంకర్ అనే వ్యక్తి వీడియో చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. గమనించిన ఆమె కేకలు వేయగా, వెంటనే పరారయ్యాడు. ఈ విషయాన్ని భర్తకు తెలపగా, భర్త అతనిని పట్టుకుని సెల్‌ఫోన్ తీసుకున్నాడు. దీంతో గౌరీశంకర్ అతనిపై దాడిచేసి మొబైల్ పట్టుకెళ్లిపోయాడు. ఈ మేరకు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న గౌరీశంకర్‌ను సోమవారం పట్టుకుని, అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు.

ఆటో, బైకు ఢీ.. ఒకరికి గాయాలు

శృంగవరపుకోట, జూలై 7(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పుణ్యగిరి రోడ్డులోని నాయీ బ్రాహ్మణ కల్యాణ మండపం సమీపంలో సోమవారం ఆటో, బైకు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైకిస్టుకు తీవ్ర గాయాలు కాగా, ఆటో డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. అరకు వేలీకి చెందిన అభిషేక్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల నుంచి బైకుపై వస్తున్నాడు. ఇదే సమయంలో చందకనాయుడు ఆటోతో ఎదురుగా వస్తున్నాడు. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో అభిషేక్‌కు తీవ్రంగా గాయాలు కాగా, ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఆటోడ్రైవర్ చందక నాయుడుకు స్వల్ప గాయాలయ్యాయి.

అంగన్‌వాడీ కార్యకర్తపై ఫిర్యాదు

భోగాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రానికి సరుకుల కోసం వెళ్లిన తనపై అంగన్‌వాడీ కార్యకర్త దౌర్జన్యం చేసిందని జగ్గయ్యపేటకు చెందిన ఎం.ఆదిలక్ష్మి అనే మహిళ సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. ఆదిలక్ష్మి కొడుకు బాలవిన్ జగ్గయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్నాడు. తన కొడుకుకు రావాల్సిన సరుకుల నిమిత్తం ఆమె తన కొడుకుతో ఈనెల 5న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. అక్కడ అంగన్‌వాడీ కార్యకర్త గంట్రేటి మంగ ముఖయాప్ పనిచేయడం లేదంటూ కాలయాపన చేస్తూ ఆదిలక్ష్మికి సరుకులు ఇవ్వకుండా ఇతరులకు ముఖయాప్ ద్వారా సరుకులు అందజేస్తుంది. దీంతో ఆదిలక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తను నిలదీసింది. దీంతో అంగన్‌వాడీ కార్యకర్త తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదిలక్ష్మిపై దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేసింది. దీంతో ఆదిలక్ష్మి ఈనెల 5న భోగాపురం ఐసీడీఎస్ కార్యాలయానికి, సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌కి ఫిర్యాదు చేసింది. దీనిపై అంగన్‌వాడీ కార్యకర్త మంగమ్మను వివరణ కోరగా ముఖ యాప్ సరిగ్గా కావడం లేదని, కొంత సమయం ఆలస్యం అయినందుకు ఆదిలక్ష్మి తనపై దౌర్జన్యం చేసిందని తెలిపారు. ● దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగను వివరణ కోరగా తమకు అందిన ఫిర్యాదు మేరకు సోమవారం జగ్గయ్యపేట అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి విచారణ చేశామని చెప్పారు. ముఖయాప్ బాగానే పనిచేస్తుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త మంగమ్మకు, ఆదిలక్ష్మికి పాత తగాదాలు కారణంగానే ఘర్షణ జరిగిందని తెలిపారు. సీడీపీవో లావణ్యకు నివేదిక అందజేస్తామని చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

జామి, జూలై 7(ఆంధ్రజ్యోతి): భీమసింగి గ్రామంలో ఒక వ్యాపారి గుట్టుగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని డీటీ మూర్తి ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. భీమసింగికి చెందిన వాకచర్ల నరేష్ అనే వ్యక్తి ఆటోలో 856 కిలోల రేషన్ బియ్యం తరలిస్తున్నట్టు విజిలెన్స్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో వీరు గ్రామం వద్ద మాటువేశారు. ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సింహాచలం, హెడ్ కానిస్టేబుల్స్ పురుషోత్తం, కామేశ్వరరావుల ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఆటో డ్రైవర్ తోపాటు బియ్యం రవాణా చేయిస్తున్న వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదుచేశారు. ఈ బియ్యం జామిలో ఒక రేకుల షెడ్డులో ఉంచారని, అక్కడ నుంచి ఇవి భీమసింగి వద్ద మిల్లుకు తరలిస్తుండగా పట్టుకున్నామని సీహెచ్‌డీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని స్థానిక డీలర్ అప్పలరాజుకు అప్పగించి రవాణాకు ఉపయోగించిన ఆటోను పోలీసులకు అప్పగించారు.

లొట్లపల్లి సంత నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

జామి, జూలై 7(ఆంధ్రజ్యోతి): లొట్లపల్లి సంత యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని గంట్యాడ మండలం పెదవేమలి సర్పంచ్ పాపునాయుడు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌కు, జామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాపునాయుడు తన మిత్రుడు రమణతో 22 కోళ్లు అమ్మేందుకు సంతకు వెళ్లగా, అక్కడ ఒక వ్యక్తి ఆసీలు కట్టాలని డిమాండ్ చేశాడు. దీనికి అనుమతులు లేవు కదా.. ఎందుకు కట్టాలని పాపునాయుడు ప్రశ్నించారు. దీంతో దౌర్జన్యం చేసి, కోళ్లు ఎత్తుకుపోయారు. సుమారు రూ.30వేలు విలువచేసే కోళ్లు పట్టుకుపోవడంతో పాటు దౌర్జన్యం చేయడంతో ఫిర్యాదు చేశామని పాపునాయుడు తెలిపారు. దీనిపై ఎస్ఐ వీరజనార్ధన్‌ను వివరణ కోరగా ఫిర్యాదు మేరకు పరిశీలించామని, సంత యాజమాన్యాన్ని పిలిపించామని తెలిపారు.

అభివృద్ధిపై మంత్రికి మాట్లాడే అర్హత లేదు

గజపతినగరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు మాట్లాడే అర్హతలేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక బెల్లాన కన్వెన్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలతో జరిగిన బాబు షూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకుడికి మంత్రి పదవి వచ్చింది జిల్లాను అభివృద్ధి చేస్తారని ఏడాది కాలంగా ఎదురు చూసినా ఎక్కడా అభివృద్ధి జాడ కానరాలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

చీపురుపల్లి, జులై 7(ఆంధ్రజ్యోతి): మెట్టపల్లిలో శాస్త్రా ఏజెన్సీలోని ఎరువుల దుకాణాన్ని శ్రీకాకుళం యూనిట్‌కు చెందిన విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ రామారావు తదితరులు సోమవారం తనిఖీ చేశారు. స్టాక్‌లో తేడాలున్నట్టు గుర్తించి రూ.1.5 లక్షలు విలువ చేసే 114 బస్తాల వివిధ రకాల ఎరువుల్ని స్వాధీనం చేసుకున్నారు. డీలర్‌పై కేసు నమోదు చేశారు. విజిలెన్స్ సిబ్బంది లక్ష్మీనారాయణ, వ్యవసా యాధికారి సూర్యకుమారి పాల్గొన్నారు.

ఘనంగా ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

రాజాం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం స్థానిక మాదిగ వీధిలో ఘనంగా నిర్వహించారు. ఎంఈఎఫ్ అధ్యక్షుడు అరసాడ ఆనందరావు జెండాను ఆవిష్కరించారు. ఇదే సభలో మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జొన్నాడ రంజిత్, ఎంఆర్‌పీఎస్ నాయకులు బోగి జయకుమార్, యందవ నారాయణరావు, ఊదల పౌలు, యందవ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

పారిశుధ్య మెరుగుకు చర్యలు

గజపతినగరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని బొబ్బిలి డివిజన్ డీఎల్‌పీవో ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. గజపతినగరంలోగల చెత్త సంపద కేంద్రాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడిచెత్త, పొడి చెత్తను వేరు చేసి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలో 150 గ్రామ సచివాలయాల్లో 50 నుంచి 60 గ్రామాలను పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేసి, ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నామని తెలిపారు. ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా గ్రామాల్లో పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈవోపీఆర్డీ సుగుణాకరరావు, ఈవో జనార్ధనరావు పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా లేకుంటే ఇంటికే..

వంగర, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మడ్డువలస రిజర్వాయర్ దగ్గర పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎస్ఈ సుధాకర్ హెచ్చరించారు. సోమవారం ఖరీఫ్ నీరు విడుదల అనంతరం ఆయన సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టర్ సమయానికి వేతనాలు ఇవ్వలేదని సాకులు చూపి, నిరసనలు చేపడితే వెంటనే తొలగిస్తానన్నారు. వర్షాకాలంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇదే విధంగా నీటి సంఘాలతో చర్చించి తాత్కాలిక ప్రాతిపదికన లస్కర్లను వెంటనే నియమించాలని డీఈకి ఆదేశాలు జారీ చేశారు. మడ్డువలసలో కేజ్ ఏర్పాటుకు అనుమతులు తీసుకున్న మత్స్య శాఖ తమ శాఖకు చెల్లించాల్సిన నిధులు చెల్లించకపోగా అవి ఎందుకు తొలగించారు.. ఎవరు తొలగించారనే అంశంపై ఆ శాఖ అధికారులకు వివరణ కోరుతానని తెలిపారు. ఈయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

ఉద్యమం.. ఉధృతం

(ఐదో పేజీ తరువాయి)

తమ్మి అప్పలరాజు దొర అండగా ఉంటున్నారు. వీరి సమస్యను గ్రీవెన్స్‌ల ద్వారా ప్రభుత్వానికి పంపిస్తున్నారు. సీపీఎం నాయకుడు చల్లా జగన్ నిత్యం నిర్వాసితులతో కలసి పోరాడుతున్నారు. మంగళవారం మానవ హక్కుల ప్రతినిధులు వస్తున్నట్లు సమాచారం. ఇలా అన్ని వైపుల నుంచి మద్దతు లభిస్తుండ డంతో జిందాల్ భూ నిర్వాసితులు తగ్గేదేలే అంటున్నారు. ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు.

2007లో భూముల అప్పగింత

జిందాల్ కోసం నాలుగు గ్రామాల పరిధిలో 834.66 ఎకరాల అసైన్డ్ భూమి, 151.04 ఎకరాల ప్రభుత్వ భూమి, 180.73 ఎకరాల జిరాయితీ భూమి కలిపి 1166.43 ఎకరాలను సేకరించి 2007 జూన్ 28న అప్పగించిన సంగతి తెలిసిందే. అప్పట్లో రూ.4 వేల కోట్లతో అల్యూమినియం శుద్ధి కర్మాగారం (రిఫైనరీ, విద్యుత్ పవర్ ప్లాంట్)ను నిర్మిస్తామని జిందాల్ యాజమాన్యం భూములను తీసుకుంది. నాలుగేళ్లలో పరిశ్రమ నెలకొల్పుతామని చెప్పింది. అయితే ఈ పరిశ్రమకు అవసరమైన ముడిసరుకు బాక్సైట్ ఖనిజం అరకు, అనంతగిరి కొండల్లో ఉంది. బాక్సైట్ తవ్వకాలతో పర్యావరణం, అరకు పర్యాటకం దెబ్బతింటుందని గిరిజనులు వ్యతిరేకించారు. దీంతో కేంద్ర పర్యావరణ శాఖ తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదు. మరోవైపు 2016లో విభజిత ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాల జోలుకుపోబోమని స్పష్టం చేసింది. దీన్ని సాకుగా చూపిన జిందాల్ యాజమాన్యం పునాది రాయి కూడా వేయడం మానేసింది. ఇతర ప్రాంతాల నుంచి అయినా ముడిసరుకు బాక్సైట్ ఖనిజాన్ని తెప్పించుకొనే ప్రయత్నం చేయకుండా నిరుపయోగంగా భూమిని తమ ఆధీనంలో ఉంచేసింది. మరోవైపు భూమిని నమ్ముకొని జీవనం సాగించిన గిరిజన రైతులు ఆధారం కోల్పోయారు. ఖాళీ భూములను చూసి ఆవేదన చెందేవారు. వారంతా సాగు లేక.. పరిశ్రమల్లో ఉపాధికి అవకాశం లేక కూలి పనులకు వెళ్తున్నారు.

గత ప్రభుత్వంలో మరో మలుపు

అల్యూమినియం శుద్ధి కర్మాగారం కాకుండా ఎంఎస్‌ఎంఈ పార్కులు, ఇతర పరిశ్రమలను స్థాపించేందుకు 2023 ఫిబ్రవరి 20న జీవో నెంబర్ 14 ద్వారా వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించింది. తాటిపూడి రిజర్వాయర్ నుంచి 5ఎంజీడీ నీళ్లు, తెన్నుబొడ్డవర సబ్‌స్టేషన్ నుంచి 50ఎండబ్ల్యూ పవర్ సరఫరా కేటాయింపుతో వీఎంఆర్‌డీఏ అనుమతి పొందేందుకు ప్రతిపాదించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో బ్రేక్‌లు పడ్డాయి. ప్రస్తుత ప్రభుత్వం పారిశ్రామికీకరణకు మొగ్గు చూపుతోంది. ప్రధానంగా ఎంఎస్‌ఎంఈ పార్కుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోంది.

నిర్వాసిత రైతుల అభ్యంతరం

జిందాల్ యాజమాన్యం సమస్యలను పరిష్కరించకుండా, హామీలను నెరవేర్చకుండా ఎంఎస్‌ఎంఈ పార్కులు, ఈ ప్రాంత రైతులకు చెందిన తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీరెలా పొందుతారని నిర్వాసిత రైతులు ప్రశ్నిస్తున్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం జిందాల్ యాజమాన్యం ఈ భూములపై హక్కులు కోల్పోయిందంటున్నారు. తిరిగి తమ భూములను తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తున్నారు.

ఎంఎస్‌ఎంఈ పార్కు కావాలంటున్న కొందరు

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్‌ఆర్‌కె ప్రసాద్‌లు కొంతమంది భూనిర్వాసితులు, నియోజకవర్గ పరిధిలోని యువతతో కలిసి ఎంఎస్‌ఎంఈ పార్కులను స్థాపించాలని జిందాల్ తాత్కాలిక కార్యాలయం వద్ద ఇటీవల ధర్నా చేశారు. వీరికి లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ సంఘీభావం తెలిపారు. నిర్వాసితులకు ఇచ్చిన ప్రతి హామీని యాజమాన్యం నెరవేర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారం రోజుల క్రితం ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణతో కలసి కలెక్టర్ అంబేడ్కర్ భూనిర్వాసితుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నష్టపరిహారం అందని రైతుల వివరాల సేకరణ బాధ్యతలను స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

మంత్రి వ్యాఖ్యలను పట్టించుకోని నిర్వాసితులు

జిందాల్ భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కుల అంశం ప్రభుత్వం వద్ద లేనప్పుడు తాటిపూడి రిజర్వాయర్ నుంచి వీటికి నీటి సరఫరా ఎలా చేస్తామని, కేవలం కొందరు వ్యక్తులు రైతులను రెచ్చగొడుతున్నారని రెండు రోజుల క్రితం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. అతని మాటలను నిర్వాసిత రైతులు పట్టించుకోవడం లేదు. చివరకు జిందాల్ యాజమాన్యం, ప్రభుత్వం ఏవిధంగా పరిష్కారం చూపుతాయో చూడాలి.

9 గంటలకు రావాల్సిందే

(ఐదో పేజీ తరువాయి)

ఎంఈవోలు ఉండడంతో కొన్ని మండలాల్లో ఆధిపత్యపోరు మొదలైంది. కొంతమంది ఎంఈవోలు మండల కేంద్రంలో నివాసం ఉండకుండా జిల్లా, నియోజకవర్గ కేంద్రాల నుంచి రాకపోకలు సాగిస్తూ మమ అనిపిస్తున్నారు. మరికొంతమంది ఎంఆర్‌సి కేంద్రాలకు వెళ్లకుండా పాఠశాలల తనిఖీ పేరుతో కాలక్షేపం చేసే పరిస్థితి కూడా జిల్లాలో నెలకొంది. ఈ నేపథ్యంలో ఎంఈవోలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కమిషనర్‌కు ఆధారాలతో ఫిర్యాదులందాయి.

ప్రక్షాళనకు దిగిన మంత్రి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాశాఖను గాడిలో పెట్టేందుకు మంత్రి నారా లోకేశ్ సైతం నడుంబిగించారు. ఫలితంగా విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు, సన్నబియ్యంతో భోజనం, తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికీ రూ.13 వేలు వంతున నగదు అందజేస్తూ విద్యాప్రమాణాల మెరుగుకు కృషి చేస్తున్నారు. ఇదే సమయంలో విద్యాశాఖ కమిషనర్ కూడా గాడిలో పెట్టే చర్యలకు దిగారు. ఎంఈవోలు మాత్రమే కాకుండా ఎంఆర్‌సీలో పనిచేస్తున్న సీఆర్పీలు, ఆపరేటర్లు, ఇతర సిబ్బంది కూడా ఉదయం తొమ్మిది గంటలకే విధులకు హాజరు కావాలని కమిషనర్ విజయరామరాజు జారీచేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

రోజూ నివేదిక..

ఉపాధ్యాయుల మాదిరిగానే ఉదయం 9.30 గంటలకు ఎంతమంది ఎంఈవోలు హాజరువేశారో జిల్లా విద్యాశాఖ ప్రతిరోజూ కమిషనరేట్‌కు నివేదిక పంపాలని కమిషనర్ ఆదేశించారు. ఎంఈవో లు ప్రతిరోజూ ఒక పాఠశాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని చెప్పారు. గతంలో కొంతమంది ఎంఈవోలు జిల్లా కేంద్రం నుంచి ఏదో ఒక సమయంలో బయలుదేరి తనకు దగ్గరలో ఉన్న పాఠశాలకు వెళ్లి తూతూ మంత్రంగా తనిఖీ చేసి హాజరైనట్లు ప్రకటించేవారు. ఈ పరిస్థితిని నివారించేందుకు తాజాగా ఎంఈవోలకు జీపీఎస్ విధానం అమలుచేస్తున్నారు. ఎంఈవో ఎమ్మార్సీ కేంద్రంలో ఉంటే అక్కడి లోకేషన్, ఏ పాఠశాలకు వెళ్తే ఆ ప్రాంత లోకేషన్ స్పష్టంగా తెలిసిపోతోంది.

తాగునీటి సరఫరాకు రూ.80 కోట్లు

పార్వతీపురం టౌన్, జూలై7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రజల దాహార్తిని తీర్చేందుకు సంపూర్ణ తాగునీటి సరఫరా పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.80 కోట్లు కేటాయించిందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం పార్వతీపురం మున్సిపాలిటీలోని 28వ వార్డులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం 5 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముున్ముందుకు సాగుతోందన్నారు. భవిష్యత్‌లో కూటమి ప్రభుత్వం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమనేది వాస్తవమన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, యువజన విభాగాల అధ్యక్షుడు జి.రవికుమార్, పి.రాజశేఖర్, నాయకులు బి.జయబాబు, ఎం.వెంకటేష్, జీవీ నాయుడు, కౌన్సిలర్లు మజ్జి శశికర్, కె.నారాయణరావు, బి.గౌరినాయుడు పాల్గొన్నారు.

ఎస్ఐటీ విద్యార్థికి ఆర్థిక సాయం

పార్వతీపురం రూరల్, జూలై7 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం దత్తి వలస గ్రామానికి చెందిన బొమ్మి వెంకటలక్ష్మి ఎస్ఐటీలో సీటు సాధించిన నేపథ్యంలో ఆర్థిక సాయం చేయాలని విద్యార్థిని తల్లిదండ్రులు కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ శ్యాంప్రసాద్ సదరు విద్యార్థినికి రూ.25 వేలు ఆర్థిక సాయం చేయాలని ఐటీడీఏ పీవోను ఆదేశించారు. దాంతో పీవో సోమవారం విద్యార్థినికి చెక్కును అందజేశారు.

రోడ్ల మరమ్మతులకు సొంత నిధులు

- రూ.7లక్షల వరకూ వెచ్చించాలని నిర్ణయం
- ప్రజల ఇబ్బందిపై స్పందించిన ఎమ్మెల్యే

బొబ్బిలి, జూలై7 (ఆంధ్రజ్యోతి): స్థానిక నియోజకవర్గ పరిధిలో రహదారులు అధ్వానంగా ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) తీవ్రంగా స్పందించారు. రోడ్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలోపు రూ.7 లక్షల మేర వెచ్చించి రోడ్ల మరమ్మతులకు నిర్ణయించారు. సోమవారం ప్రజలకు ఆడియో, వీడియో సమాచారం విడుదల చేశారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి బొబ్బిలి ప్రాంత రోడ్ల సమస్యలపై అసెంబ్లీలో, డీడీఆర్‌సీ సమావేశాల్లో మాట్లాడానన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంలకు విషయం తెలియజేశానన్నారు. బొబ్బిలి నుంచి అలజంగి, కారాడ మీదుగా తెర్లాం రోడ్డుకు రూ.4.50 కోట్లు, బొబ్బిలి-రామభద్రపురం రోడ్డుకు రూ.4.50 కోట్లు, ఆకులకట్ట-పినపెంకి రోడ్డుకు రూ.2.60 కోట్లు, వీటికి టెండర్ల ప్రక్రియ సాగుతోందని తెలిపారు. రాజా కళాశాల రోడ్డుకు రూ. కోటి బుడా నిధులు మంజూరు కానున్నాయన్నారు. బొబ్బిలి పట్టణంలోని రాజా కళాశాల రోడ్డుకు రూ.2.50 కోట్లు కావాలని మంత్రి నారాయణనను కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఆ పనులు ప్రారంభమయ్యేలోగా మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ ప్రజలకు తాను పూర్తిస్థాయి జవాబుదారీగా పనిచేస్తానని ఎమ్మెల్యే బేబీనాయన వివరించారు.



లేబర్ కోడ్‌లు రద్దు చేయండి

రామభద్రపురం, జూలై7 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లు కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బలసా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట కార్మికులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 9న దేశవ్యాప్తంగా సమ్మె, బైర్‌బంద్ పాటిద్దామని ఆయన కోరారు. అలాగే ఇప్పటికైనా ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించి పేద ప్రజలను ఆదుకోవాలన్నారు. ఆటోల కొనుగోలుకు బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేయాలన్నారు. ఆటో కార్మికుల ఉపాధిని దెబ్బతీసే ఓలా, ఉబర్, రాపిడో వంటి కార్పొరేట్ కంపెల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ కాకి సురేష్, ఆటో యూనియన్ ప్రెసిడెంట్లు రామకృష్ణ, యూనియన్ నాయకులు, గంగరాజు, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

క్షమాగుణాన్ని దేవుడు స్వాగతిస్తాడు

బొబ్బిలి, జూలై7 (ఆంధ్రజ్యోతి): క్షమాగుణాన్ని ఆ దేవదేవుడు మనసారా స్వాగతిస్తాడని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు అన్నారు. ప్రపంచ క్షమాపణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కారుణ్య కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచ వ్యాప్తంగా అశాంతి రాజ్యమేలుతోందన్నారు. కోపం, ద్వేషం, ప్రతీకారం ప్రజ్వరిల్లే చోట వాటి మెడలు వంచి శాంతికి బాటలు వేసే ఒకే ఒక్క గొప్ప శక్తి క్షమాపణ గుణానికే ఉందన్నారు. దైనందిన జీవితంలో క్షమాగుణాన్ని అన్ని వర్గాల వారు అలవరుచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, యుగంధర్, శివకాంత్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బాబు పాలనపై జనం అసంతృప్తి

రామభద్రపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనకు చరమగీతం పాడే దిశగా ప్రజలు అడుగులు వేస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక వైసీపీ మండల కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఎన్నికల్లో సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించడం చంద్ర బాబుకు అలవాటై పోయిందన్నారు. ప్రజలను ఓటు బ్యాంకుగా వాడుకుని గెలవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఏడాదికే చంద్రబాబు పాలనపై ప్రజలకు విసుగెత్తిపోయారన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, రామభద్రపురం పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా పేరెంట్స్ డే

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని వారం రోజుల ముందే ఉత్తర్వులు వెలువడడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు జోరందుకున్నాయి. తల్లిదండ్రుల సమావేశాలు కొత్త కానప్పటికీ, ఈ సారి పలు ప్రత్యేకతలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పూర్వ విద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు, ఎవరి స్థాయిలో వారు నిధులు సేకరించి కార్యక్రమం విజయవంతం చేసే ప్రణాళికతో ఉన్నారు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఈ పేరెంట్స్ డే నిర్వహణకు కమిటీలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ కమిటీ, పర్యావరణ పరిరక్షణ, రిసెప్షన్, సీటింగ్ ఏర్పాట్లు, విద్యార్థుల ప్రగతి నివేదికల తయారీ, స్టేజీ నిర్వహణ వంటి పనులకు వేర్వేరు కమిటీలను నియమిస్తున్నారు.

పిల్లల ప్రగతిపై సమగ్ర నివేదికలు

ప్రత్యేకంగా నిర్వహించే ఈ సమావేశంలో పిల్లల ప్రగతికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికల్ని తల్లిదండ్రులకు అందజేయనున్నారు. సమగ్ర శిక్ష అధికారులు తయారు చేస్తున్న ఈ నివేదికల్లో అకడమిక్ వివరాలతో పాటు హాజరు, ఆటపాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో కనబరచిన ప్రతిభ, ఇతర రంగాల్లో పురోగతి, ఆరోగ్య సమాచారం, ఎత్తు, బరువు తదితర వివరాలను కూడా పొందుపరచనున్నారు.

పిల్లలు, పేరెంట్స్‌కు వేర్వేరుగా ఆటల పోటీలు

ఈ మెగా డేలో పిల్లలకు, వారి తలిదండ్రులకు వేర్వేరుగా పలు క్రీడల్లో పోటీలు నిర్వహించి బహుమతులందజేయనున్నారు. సెల్ ఫోన్లు, ట్యాబ్‌లు అధికంగా వినియోగించే పిల్లల పట్ల వ్యవహరించాల్సిన తీరుపై పెద్దలకు అవగాహన కల్పించనున్నారు. పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులను కూడా ఆహ్వానించి కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా కుటుంబ ఫొటో డ్రీమ్ వాల్స్, పాజిటివ్ పేరెంటింగ్ సెషన్లు, అమ్మ పేరుతో మొక్క నాటడం, గ్రీన్ పాస్‌పోర్టు కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే, మానసిక ఆరోగ్యం, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సందేశాలు, పిల్లల పురోగతిపై ఇంటరాక్టివ్ సెషన్లు జరుగనున్నాయి.

సాయన్నగెడ్డపై కూలిన వంతెన

(ఐదో పేజీ తరువాయి)

సంతకవిటి మండలం కొండగూడెం, మాదవరాయపురం, జావాం, కేఅర్‌పురం, కొత్తూరు నారాయణపురం గ్రామలవారికి ఇదే ప్రధాన మార్గం. నారాయణపురం మీదుగా శ్రీకాకుళం వెళ్లడానికి కూడా ఇదే అనువైన మార్గంగా ఉంది.

ఇసుక తరలింపుతోనే..

- సంతకవిటి, రేగిడిమండలాల సరిహద్దున నాగావళి నదీతీరంలో ఖండ్యాం-జావాం వద్ద ఇసుకరీచ్ ఉంది. రీచ్ నుంచి స్టాక్ పాయింట్‌కు పదులసంఖ్యలో భారీవాహనాలు ఈవంతెన గుండా వెళ్తున్నాయి. ఈక్రమంలోనే శిథిల వంతెన మరింత బలహీనమై కుంగిపోయిందని స్థానికులంటున్నారు. ఘటనా స్థలాన్ని ఇరిగేషన్ అధికారులు సోమవారం పరిశీలించారు.

ఆ చోరీ కేసు సంగతేంటో?

(ఐదో పేజీ తరువాయి)

పలుమార్లు మహారాష్ట్రకు వెళ్లినప్పటికీ ఎటువంటి ప్రయోజనం కనిపించలేదు. పోలీసులకు అందిన ఫిర్యాదు ప్రకారం 90 తులాల బంగారం, 5 లక్షలు నగదు చోరీ అయ్యాయి. ఇంత పెద్ద ఎత్తున జరిగిన చోరీకి సంబంధించి ఇప్పటి వరకు తులం బంగారం కూడా రికవరీ కాలేదు. భవిష్యత్తులో బంగారం రికవరీ జరుగుతుందా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చోరీ అయిన బంగారం ఇప్పటికే చేతులు మారిపోయి ఉండొచ్చునని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసులో ప్రధాన నింది తుడిగా ఉన్న లక్కీకి మూడు రాష్ట్రాలకు సంబంధించిన నేరాలతో సంబంధాలు ఉన్నాయని సీఐ షణ్ముఖరావు తెలిపారు. ప్రధాన నిందితుడు ఎక్కడ దొరికినా మూడు రాష్ట్రాల పోలీసులు గాలిస్తున్నందున పీటీ వారెంట్లతో వివిధ పోలీసు స్టేషన్‌లకు సంబంధించిన పోలీసులు దర్యాప్తు కోసం తీసుకుపోయే అవకాశం ఉందంటున్నారు. రాష్ట్రం కాని రాష్ట్రంలో నిందితులను పట్టుకోవడం పోలీసులకు తలనొప్పిగా మారిపోయింది.

రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల పంపిణీ

బొబ్బిలి రూరల్, జూలై7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లోసోమవారం రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ముందస్తు వర్షాలు కురవడం, ఉబాలు ఊపందు కోవడంతో వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతులకు అవసరమైన ఎరువులను పంపిణీ చేస్తున్నామని బొబ్బిలి ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ తెలిపారు. పక్కి, అలజంగి, ఎం.బూర్జవలస గ్రామాల రైతులకు అందజేశారు.



బొబ్బిలి ఏఎంసీ నుంచి ఎరువుల పంపిణీ

పి-4 కాన్ఫరెన్స్‌లో అధికారులు

బొబ్బిలి రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పి-4 విధివిధానాలపై సోమవారం కలెక్టర్ అంబేడ్కర్ నిర్వహించినవీడియో కాన్ఫరెన్స్‌లో బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎంపీడీవో పి.రవికుమార్‌తో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇందులో కలెక్టర్.. జిల్లా అధికారులకు బంగారు కుటుంబాల దత్తత తీసుకునే ప్రక్రియలో సూచనలు చేశారు. మెగా పేరెంట్స్ కార్యక్రమం జయప్రదం చేయడం కోసం అందరు హెచ్ఎంలు, విద్యాశాఖాధికారులకు పలు సూచనలు చేశారు.



కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

అనాథ విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

బాడంగి, జూలై7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం వీకే యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్, క్రేజీబీ ఫైనాన్సియల్ సర్వీసెస్ అనాథ విద్యార్థినులకు ఉచితంగా రూ.5 లక్షల విలువైన 70 సైకిళ్లను సోమవారం పంపిణీ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు పి.రామారావు, ఎంపీటీసీ సభ్యుడు డి.శ్రీనివాసరావు, సర్పంచ్ కె.రమేశ్, హెచ్ఎం డి.సత్యనారాయణ, వీకే ట్రస్టు ప్రతినిధి సానా సత్యకుమార్‌ల చేతుల మీదుగా అందజేశారు. ఈ విద్యా సంవత్సరంలో మరో వంద మంది మెరిట్ విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి రూపాయల చొప్పున వారి బ్యాంకు ఖాతాకు స్కాలర్‌షిప్ రూపంలో ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాజేశ్వరి, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు తదితరులున్నారు.



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న దృశ్యం

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి

బాడంగి, జూలై7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గదబవలస గిరిజన గ్రామానికి శ్మశానవాటికకు స్థలం కేటాయించి రోడ్డు వేయాలని గ్రామస్థులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్‌కు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ కొన్ని తరాల నుంచి గిరిజన గ్రామమైన గదబవలస గ్రామానికి ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకపోవడం చాలా అన్యాయమన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

భూసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

రామభద్రపురం, జూలై7 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మండల రెవెన్యూ అధికారి అజురఫీ జాన్ తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా గ్రామాల్లో సర్వే సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని ప్రాధాన్యతపరంగా పరిష్కరిస్తామన్నారు. అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించండి

రామభద్రపురం, జూలై7(ఆంధ్రజ్యోతి): పాతరేగలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం చేపట్టాలని మాజీ సర్పంచ్ గొర్లెశ్రీనివాసరావు కోరారు.సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రత్నంను కలిసి సమస్యను వివరించారు. కొన్ని నెలల కిందట ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందడంతో ఈ పోస్టు ఖాళీగా ఉందన్నారు. దానివల్ల ఉపాధి పనులు జరగడంలేదని వివరించారు. కార్యక్రమంలోఎంపీటీసీ మాజీ సభ్యుడు పెద్దింటి పైడిపునాయుడు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

బొబ్బిలి, జూలై7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9 న దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ మునకాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక జెండామహల్ జంక్షన్‌లో సోమవారం సాయంత్రం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కొలుసు వెంకట సత్యనారాయణ, గొల్లపల్లి తౌడు, లక్ష్మణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు. అలాగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, పట్టణ కళాసీ సంఘం అధ్యక్షుడు బోగాది అప్పలస్వామి పిలుపునిచ్చారు.

- బొబ్బిలి రూరల్: మండలంలోని రంగరాయపురంలో సోమవారం జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి గోపాలం పిలుపునిచ్చారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చి దేశంలో కోట్లాది మంది శ్రమజీవులకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.రైతు వ్యతిరేక చట్టాలు అమలు చేయడానికి ప్రయత్నం చేస్తూ దేశంలో 40 కోట్ల ఎకరాల సాగు భూమిని కార్పొరేట్లకు దోచి పెట్టాలని ప్రధాని చూస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు ఉడమల ప్రసాద్, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

నేడు బొబ్బిలికి హోం మంత్రి రాక

బొబ్బిలి, జూలై7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం ఉదయం బొబ్బిలి పట్టణంలో పర్యటించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన ఆధ్వర్యంలో పట్టణంలోని 17వ వార్డులో నిర్వహించనున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొంటారు. స్థానిక శ్వేతాచలపతి స్కూల్ జంక్షన్ నుంచి ఆమె వార్డులో మహిళలతో ముఖాముఖి కానున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలను హోంమంత్రి ప్రజలకు వివరించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కూటమితోనే అభివృద్ధి

రామభద్రపురం, జూలై7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూసాయవలసలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గంటసాయి, నాయకులు వంగపండు భీమునాయుడు, కల్లూరు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ

బొబ్బిలి రూరల్, జూలై7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ పురోగతి సూచికపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఎంపీడీవో పిరవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.శిక్షణకు పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొనాలని సూచించారు.

ఆకుమడుల్లో నీరు నిల్వ వద్దు

రామభద్రపురం, జూలై7 (ఆంధ్రజ్యోతి):ఖరీఫ్ సీజన్‌లో ఆకుమడుల్లో నీరు లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి అమరా శివ తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నీరు నిల్వ ఉండటం వల్ల ఆకుమడులు కుళ్లిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే నారువేసిన 15 రోజుల తరువాత 3 నుంచి 4 కేజీల యూరియా వేయాలని, 3జీ గుళికలు కూడా వేయాలని సూచించారు. అలాగే అన్నదాతా సుఖీభవ కింద జూలై 3వ వారంలో ప్రభుత్వం ఖాతాల్లో నగదు జమ చేస్తుందన్నారు. అర్హత ఉండి పేర్లు లేని రైతులు రైతు సేవా కేంద్రాల్లోగ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆయనతో పాటు ఏఈవో పిల్లా వెంకటరమణ పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

సీతంపేట రూరల్, జూలై7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టిటుకుపాయి జంక్షన్‌లో సోమవారం దోనుబాయి ఎస్ఐ మస్తాన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. 10 లీటర్ల సారా తరలిస్తున్న సవర సింగను అరెస్ట్ చేశామని ఎస్ఐ తెలిపారు.